# ఓ తోట కథ

ఒక్కోస్థలం, ఒక్కోకాలంలో ఒక్కో తీరులో వెలుగు వెలుగుతుంది. స్థల మహిమంటారు మీరు. అలాంటి మహిమ నాకూ వుంది. నా స్థలపురాణం ఎక్కడ నుంచి ఆరంభించను? బలరాముని నాగలి సృష్టించిన నాగావళీతీర శివక్షేత్రాలూ, అరసవిల్లి ఆదిత్య క్షేత్రం స్థల పురాణాలకీ, నాకూ చారిత్రక కాలంలో తేడా లేదు. అక్కడ నుంచి ఆరంభించనా? పోనీ, రాజుల కాలం నాటి "కోటేశ్వర అగ్రహారం" నుండి గానీ, నవాబుల కాలంనాటి 'చికాకోల్' స్థల పురాణమో? సరే...సరే! చరిత్ర చెప్పను! చరిత్ర చెప్పకు అని విసుక్కునే ఆధునికులు మీరు.

రాజుల్నీ, నవాబుల్నీ, చిరాఖరికి మీరు తరిమేసిన దొరలనీ వొదిలేసి మీ కాలంలోకి వచ్చేస్తాను. నేను ముందే చెప్పాను గదా... స్థల మహిమ నాకూ వుందని! గానీ, ఇపుడు నమ్మరు మీరు. అదీగాక అయిదు నక్షత్రాల భవంతి... కూలిపోయి, శిథిలాలు.... గర్భంలోకి కూరుకుపోయిన దృశ్యం చూసేక, అసలు నమ్మరు.

పత్రికల వారేమో వాస్తు దోషమని వ్యాసాలు రాసేరు. ఇంకెవరో... ఇంజనీరింగ్ లోపమంటారు. యింకేదో అంటారు. వినీ వినబడకుండా అక్కడక్కడా లేబరోళ్ళ ఉసురు కొట్టేసిందంటారు కొందరు. నిజం చెప్పనా, ఆ భవంతిని... నేనే కూల్చాను.

ఆ అంతస్థుల నక్షత్రాల భవంతి లేపడానికి – వాడెన్ని యెత్తులూ జిత్తులూ వేసాడో తెలుసా? ఎన్ని కుటుంబాల్ని కూల్చేడో? ఎందర్ని నిరాశ్రయుల్ని చేసాడో తెలుసా? అందుకే – నా ఒళ్ళు మండిపోయింది. నా కడుపు తరుక్కుపోయింది. అంతే! నన్ను, నేను విదిలించుకుని కంపించేను.

అయిదు నక్షత్రాలు భవంతీ... ఫెళ్ళున కూలిపోయింది. వాడి అంతస్థూ, ఐశ్వర్యమూ... అహం....శిథిలాల్లో వెదుక్కోమనండి.

సహనానికి నన్ను ఉదహరిస్తారు మీరు! భూదేవి సహనాన్ని – సరళీకృత మార్కెట్‌లో అమ్మకానికి పెడతారా? ఛాందసులు శివక్షేత్రాలు సృష్టించేరుగానీ, ఆధునికుల్లా శవ క్షేత్రాలు సృష్టించలేదు.

మళ్ళీ ఆవేశమొస్తోంది....! మరోసారి ఆవేశంతో ఊగిపోయే ప్రమాదంలోకి వెళ్ళను. పురాణంలోకి వస్తాను.

అన్నట్టు ఆరంభంలో ఆఖరి ఘట్టం చెప్పేను గదూ...? ఎలా చెప్పినా, అదో శిల్ప విన్యాసంగా అర్థం చేసుకోగల ఆధునికులు గదా మీరు.

పట్నంకి ఈశాన్యం మూలలో 'చొక్కావారి తోట!'

అప్పటికి, 'నాగావళిపురం' ఇంత పట్నం కాదు. నదిమీద బ్రిడ్జికి అవతల వొక పేట, ఇవతల పట్నం! పట్నంలో ఇప్పుడున్నన్ని మేడలు లేవు. ఇన్ని వార్డు ల్లేవు. ఇన్ని రోడ్లూ లేవు. దమ్మలవీధి, మండల వీధి, మధ్యలోన టౌనుహాలు. ఈ కొసకి బొందీల గల్లీ. అప్పట్లో టౌను – నుండి దక్షిణానికి కాకులు దూరని కారడవి దాటాల్సి వొచ్చేది, కలెక్టరు కచేరి చేరడానికి. ఇటు మున్సబు మేస్ట్రేటు కోర్టుకో... బొందీలగల్లీ, అది దాటితే ఎదురు పొదల అడివే! అక్కడ మేస్ట్రేటు కోర్టు. మధ్యల పట్నం. నడీధిలో... అగ్రహారం బ్రాహ్మల ఇళ్ళుండేవి. మార్కెట్ పక్క షావుకార్ల యిళ్ళు. మిగిలిన పేటల్లంట చాకళ్ళు, మంగళ్ళు, మాలమాదిగలు, కాపులు, వెలమలు అన్ని కులాలవాళ్లూ, వృత్తుల వాళ్ళూ వుండీవోళ్ళు.

పట్నం ఆనించిన పంట పొలాలే పట్నంలోని యెక్కువ కుటుంబాలకి జీవనాధారం. పంట పొలాలకే విలువుండేది. పట్నంలో స్థలాలకి పెద్ద విలువుండేది. కాదు.

అప్పుడూ, ఇప్పుడూ విలువున్న స్థలాన్ని నేనే. చొక్కావారి తోటని! నా విలువెప్పుడూ తగ్గలేదు. రకరకాల ఫల వృక్షాలు పెంచాడు, మహానుభావుడు చొక్కా జగన్నాథం నాయుడు. అప్పట్లో నన్ను చూసి నాకే ముచ్చటేసేది. ఆకుపచ్చ తోట... ముచ్చటగా వుండదా? నా దగ్గరకొస్తే యెవ్వర్నీ ఉత్తి చేత్తుల్తో పంపేవాడు గాదు జగన్నాథం నాయుడు. నారింజో, బత్తాయో, మామిడో, సపోటాయో యేదో ఒక ఫలం ఇచ్చి పంపేవాడు.

అందరూ నన్ను అభిమానంగా చూసేవారు. జగన్నాథం నాయుడు, నన్నూ, తన కన్నబిడ్డల్నీ వోకేలా అభిమానించేవాడు. జగన్నాథం నాయుడికి వొక కూతురూ, ఒక కొడుకూ సంతానం. కూతుర్ని చొప్పంగి ఊరి నాయుడోరి అబ్బాయికిచ్చి పెళ్ళి చేసాడు. కూతురి కోసం నన్నూ... అల్లుడికి కానుకగా ఇచ్చేసేడు. 'చింతామణి' నాటకంలోని భవానీ శంకరుడిలా' – 'అత్తవారిచ్చిన అంటు మామిడితోట' పద్యం పాడకుండానే, నన్ను చల్లగా అమ్మేసేడు నాయుడోరి బాబు – బిల్లంశెట్టి తవిట్రాజు షావుకారికి.

బిల్లంశెట్టి షావుకారి చేతిలోకొచ్చేక నా రూపు మారిపోయింది. షావుకారికి భూములు ఎక్కువ లేవు. గాని, భూమ్మీద పండే పంటలు ఎక్కువ వొచ్చేవి. పంటలు కొనటం, అమ్మటం, పండించే రైతులకు విత్తనాలు, ఎరువులు, పనిముట్లు అమ్మటం షావుకారి వ్యాపారం.

అందుకని తోటలో మొక్కలన్నింటినీ కొట్టించేసాడు. గొడాంలు రెండు లేపాడు. తూనిక కాటాలకు షెడ్డులేసాడు. రైతుల పంటలు, రకరకాల వృత్తి పనివాళ్ళ సరుకులు తక్కువ ధరకి కొనేసి, నా కడుపులో దాచేవాడు. ధర పెరిగినపుడు అమ్మేవాడు. లాభాల మీద లాభాలు తీసేవాడు. ఆ లాభాలు చెందవలసినదెవరికో నాకు తెలుసుగానీ, మౌనంగా షావుకారి సంపదని మోయసాగేను. నా ఆకుపచ్చని సౌందర్యం చెరిగిపోయింది.

జగన్నాథం నాయుడు, నన్ను చూసి నొచ్చుకునేవాడు. అంతకంటే బాధగా కూతుర్ని తల్చుకు యేడ్చేవాడు. చొప్పంగి నాయుడుగోరి అబ్బాయి – రాజులమ్మని రాచి రంపాన పెట్టేవాడట. ఆయమ్మకి సవతి పోరు గూడానట! రాజులమ్మ పసికందుని చంకనెత్తుకుని కన్న వారింటికొచ్చేసింది. జగన్నాథం నాయుడుకి పసిబిడ్డని అప్పజెప్పేసి, యెవరికీ కనబడకుండా, తోటలోకి వొచ్చింది.

నాకు – రాజులమ్మను... కొమ్మల చేతుల్ని ఊపి పిలువాలని, ఆమెకు ఫలాల గోరుముద్దలు తినిపించాలనీ అన్పించింది. ఏవీ? ఎక్కడివీ? కొమ్మలూ, రెమ్మలూ...వాటికి విరగ్గాసిన ఫలాలూ యేవీ? బోడిగా మిగిలేను గదా? దిగులుగా రాజులమ్మను చూసేను.

దబ్బుమన్న శబ్దం వచ్చింది. ఆందోళనగా అటువైపు చూసేను. చెట్టునీ, చేమనీ నరికించిన షావుకారి – తోటలోని నూతిని కప్పిపెట్టలేదు. నేల నుయ్యి అది! నా గుండెలు చల్లగా ఘనీభవించేయి.

జగన్నాథం నాయుడు – కూతురి శవం కోసం తోటలో అడుగు పెట్టినప్పుడైతే, నాకు దుఃఖమాగలేదు. సీతమ్మవారిని కలుపుకున్న భూదేవిని కానయ్యా! జగన్నాథం నాయుడో– అని అరిచేను. నా అరుపులు విన్పించకుండా షట్టర్‌లు మూసేడు షావుకారి. ఈ ఘటన తర్వాత, నేను చాన్నాళ్ళు నిస్తేజంగా వుండిపోయాను.

ఈ కాలంలోనే కూతురి మరణ వ్యధతో మంచంపట్టేసిన జగన్నాథంనాయుడు కొద్దినాళ్ళకే మట్టిలో కలిసిపోయేడట. జగన్నాథం నాయుడి కొడుకు, తోట గురించి కోర్టు కెక్కాడట. ఆడపిల్లకు అనుభవించే హక్కుగా తోట కానుకిచ్చేముగానీ అమ్మకానికి గాదనీ, ఆడబిడ్డే మరణించింది, గనుక ఇక తోట తమకే చెందాలనీ దావా వేసేడట.

ఈ వార్తలన్నీ ఉత్తరంవేపు స్థలం చెప్పింది.

నిజమే, నిజమే... తోటమీద హక్కూ, అధికారం, చొక్కా వోరి బిడ్డా... నీదే, నీదే అని పలికేను. కోర్టులో నీదే తోట, 'భూమి తోడు' అని వొట్టెయ్యమన్నాను. ఎందుకయినా మంచిదని మేజ్రీటు కోర్టు.... స్థలం తోటి మాట్లాడేను. కోర్టు స్థలం, నల్లగా మొహం పెట్టింది. అది చూసి నాకు యెడమ కన్ను అదిరింది.

ఇటు... మా షావుకారి యిరుకులో పడిపోయేడు. 'తోట స్థలం' దావా ఒకవైపు.

మరోవైపు రాజులమ్మ చావు, మర్డర్ కేస్ కింద యెందుకు కట్టకూడదూ అని పోలీసులు! ఇంకోవైపు గొడాంలో, పన్నుగట్టని దినుసుందని, తాళాలు బద్దలుగొట్టి, సరుకుని పట్టుకుపోయేరు పన్నుల అధికారులు. ముందుకి నుయ్యి, వెనక్కి గొయ్యి, మధ్యకి... మంటల గుండం! షావుకారికి... ఊపిరాడలేదు.

పట్నంలో అప్పటికి, కొత్త మార్కెట్ పుట్టింది. జాతీయం అయిన బ్యాంకుల్ని వాడుకొని ట్రాక్టర్లూ, ఆయిల్ యింజన్లూ, వాయిదాల మీద అమ్మే ఏజన్సీలు వెలిసాయి. కో-ఆపరేటివ్ సొసైటీల ద్వారా - కొందరు పెద్ద రైతులయిపోయి, వాళ్లే రైతుల పంటల్ని కిట్టుబాటు ధరలిచ్చి కొనడం ఆరంభించేరు. బిల్లంశెట్టి షావుకారి, పాత రోజుల్లోని భూస్వాముల్లాగే... యెదుగుదలలోంచి, తరగుదలలోకి వొచ్చేడు. దానికి, యీ కేసులు జమగూడేయి. షావుకారి భార్య బంధువొకాయన ఆదుకోడానికొచ్చేడు.

"చొక్కావోడి దావా...నీను నడుపుతాను. కర్సూ, గిర్సూ నీనే సూసుకుంతాను. నాకు పలుకుబడి వుందిగాబట్టి కాసుకోగల్ను...నువ్వు కాసుకోలేవు..." అన్నాడు ఆ బంధువు.

"...బావ చెప్పిందే రైటు. నీకేటి ఊరా? పేరా? కాసుకోలేవు..." షావుకారి భార్య గూడా తేల్చి చెప్పింది.

"....అంతకంటన్నా! అయితలగే సూడు. చొప్పంగి నాయుడోరికి యిచ్చిన ధర యిచ్చీ చాల్ను. నాకు లాభమొద్దు..." అన్నాడు షావుకారి.

ఆ బంధువు - రూపాయి నాణేలు గుల్లించినట్లు నవ్వేడు. షావుకారి భార్య, కొత్త రూపాయినోట్లు రెపరెపలాడినట్లు... విసుక్కుంది.

"...తోట నీదేటి? సొమ్ము నీకివ్వడంకి...?" బంధువు ప్రశ్నించేడు.

"అతగాడిదని, చొక్కావోరి పిల్లడు కేసెట్టేడుగదేటి?" భార్య కేసు గుర్తు చేసింది.

"... మరి, నీను సొమ్మిచ్చి కొన్నానుగదేటి?" షావుకారి ప్రశ్నించేడు.

"....దొంగ సరుకు - కొనుకున్నా కోర్టు వొప్పుకోదు" తీర్పు చెప్పాడు బంధువు.

"...అయితే, కోర్టు నీకు ఒప్పుకుంటాదేటి?" షావుకారి యేడుపుమోతు ప్రశ్న వేసాడు. బంధువుకి కోపమొచ్చేసింది.

ఇదంతా... నా దగ్గరే జరుగుతోంది. గొడాం పక్కగా వేసిన పెంకుటింటి వసారాలో, మంచాల మీద కూర్చోని మాట్లాడుతున్నారు వాళ్ళు. మంచంమ్మీంచి బంధువు లేచిపోయి,

"...భాగ్యం, మేనత్త కూతురివని, నీ మొకం చూసి, నీ ఆపద గట్టెక్కించాలని వొచ్చేను. నీ పెనిమిటి లాభనష్టాలు లెక్కబెడ్తన్నాడు. నీ హక్కుగాని తోటని కొంటే - నా కొచ్చే లాభమేటి? మర్డర్ కేసు కింద పోలీసులు నీ పెనిమిటిని జెయిల్లో పెడితే, నేను బెయిలు పెట్టి, జామీనుండీ ఇడిపిస్తే - నాకొచ్చే లాభమేటి? పన్నుల అధికార్లని పలకరించి,

మచ్చికజేసి, నీ సరుకులు నీకు యిప్పించితే, నాకొచ్చే లాభమేటి? ఏటి? ఏటి? ఏటి?" అని ప్రశ్నలు వేసేడు.

భాగ్యం యేడుపు రాగం యెత్తుకుంది. బావగారి దగ్గరకుచేరి,

"....మరదల్ని నా దగ్గరా లాభాల్లెక్కేనా...?" మొహమ్మీద మొహం పెట్టి అడిగింది.

"....చుట్టానివయితే, యింటికి రా! కలిగింది పెడతాను. అంతేగాని" అంటూ నడవబోయేడు.

భాగ్యం భర్తని మొట్టింది. కటకటాలు గుర్తుజేసింది. బంధువు... భుజాన్ని పట్టుకుంది. ఎట్టకేలకు, పోలీసు కేసు మాఫీకి, పన్నుల అధికార్లు పట్టుకుపోయిన సరుకుల్ని యిప్పించడానికీ బదలాయింపుగా చొక్కావారి తోట... బంధువుకి యిచ్చేయడానికి.... పత్రాలు రాయించడమైపోయింది.

షావుకారి బంధువు... చేతిలోకి మారేను. ఆయన, గొడాంలన్నిట్నీ కూలగొట్టేసి, పెట్రోల్ బంక్ పెట్టడానికి ప్లాన్ వేసాడు. బంక్ లైసెన్స్ కోసం ప్రయత్నించేడు. కావలసిన పత్రాలన్నీ సమర్పించేడు గానీ, యెక్కడో ఫైలు ఆగిపోయింది. దాన్ని కదిపే శక్తి రాజకీయానికే వుందని గ్రహించలేకపోయాడు. గ్రహించినా, రాజకీయ శక్తి లేదతనికి. అప్పుడు... గుర్తొచేడు ధనంజయ!

పట్నంలోని రెండు రాజకీయ గ్రూపుల్లో, ఒక గ్రూపు నాయకుడు... ధనంజయ! ధనంజయ అన్ని సహాయాలూ చేసాడు. షావుకారి మీద కేసు యెత్తించేసి, పన్నుల అధికార్లనుండి సరుకు యిప్పించేడు. గానీ, బంధువు కోరిన బంకు యిప్పించలేకపోయేడు.

"సూతుం. నీకేటి బయిమొద్దు. కానీయి, బంక్‌కి యేర్పాట్లు సేసీసుకో. సెంటర్ మినిస్ట్రు.... మనకేస్టోడే వున్నాడు... సూతుం..." అన్నాడు ధనంజయ.

ధనం – హామీతో, బంధువు నా చుట్టూ మన్నూ, రాయీ పోసి మధ్యలో గొయ్యిలు దవ్వి మరోవైపు వాహనాల రాకపోకలకి బాట వేయసాగేడు. ఈసారి పెట్రోల్ బంక్‌గా రూపుదిద్దుకోబోతున్నాను.

ఇటు, జగన్నాథంనాయుడు కొడుకు – పట్టు వదలని విక్రమార్కుడిలా... వాయిదాలన్నింటికీ కోర్టు కెల్తున్నాడు. పంటభూమిలో ఫలసాయం వాయిదాలకే చెల్లిపోయేది. పెరిగిన కుటుంబం, ఖర్చులూ... అప్పులపాలుజేసాయతణ్ణి !

జగన్నాథంకొడుక్కి – పాల్ఘాట్ హోటల్ గోపి అప్పిచ్చేవాడు. హోటల్ పెట్టడానికొచ్చిన పాల్ఘాట్ గోపి, మెల్ల మెల్లగా పట్నంలో స్థిరపడ్డాడు. హోటళ్లూ, సిన్మాహాళ్లూ, బస్సులూ నడిపే వ్యాపారానికి యెక్కువ లాభాలొచ్చే దశకి పట్నం యెదిగింది. పాల్ఘాట్ గోపీ రెండు బస్‌రూట్లు లైసెన్స్‌పొంది, రెండు బస్‌లు నడుపుతున్నాడు. పాల్ఘాట్ గోపీకి, నా

మీద దృష్టి పడింది. జగన్నాథంనాయుడు కొడుకు కేసు గెలవగానే నన్ను కొనేయాలను కున్నాడు.

"...నువ్వు దావా నడుపుతుంటే, అవతల వాళ్లు... నీ స్థలం మీద ఆక్రమణకి దిగి, కట్టడాలకి పూనుకుంటే చూస్తావేమి?" అనడిగేడు గోపీ!

"...ఏంజెయ్యమంటావ్? కొట్లాటకి బలం చాల్దు. ఆళ్లకి జెడ్పీ ఛైర్మన్ సపోర్టుంది" అన్నాడు జగన్నాథంనాయుడు కొడుకు.

"...మనకి, టౌనుహాలు గ్రూపు సపోర్టు లేదేటి? ముందు, స్టే తీసికిరా! కోర్టుల స్టేకి పిటీషన్ వెయ్యి. ఆ తర్వాత, యేమి చేస్తుమో... టౌను హాలు గ్రూపుకి చెప్తుము" అన్నాడు పాల్ఘాట్ గోపి.

స్టే తెచ్చాడు. బంకు పని ఆగింది! ఎవరూ, తీర్పు వచ్చే వరకు 'చొక్కావారి తోట'లోకి దిగగూడదంది కోర్టు! కోర్టు ఆజమాయిషీలో మిగిలేను.

ఇంతలో రాజకీయాల్లో కొత్తకొత్త నాయకులొచ్చేరు. పట్నంలో గూడా గతంలోని రైతులు... వ్యవసాయంలోని యెగుడుదిగుళ్లతో భూమి కంటే యితర వృత్తులకు అలవాటు పడ్డారు. పట్నం పెరుగుదలతో యితర వృత్తులూ పెరిగేయి.

నదికి ఆవలొడ్డువైపు, అదేదో మందుల ఫేక్టరీ; నదికి యీ వైపు... జూట్ మిల్లూ... పేపర్ మిల్లూ, మరోవైపు మరో మిల్లూ... వచ్చేయి. జూట్ మిల్లూ, షుగర్ ఫేక్టరీలూ – రైతు పంటలకి గిరాకీ తెస్తాయనుకుంటే – పట్నంకి ఆనించిన భూములకి గిరాకీ తెచ్చేయి. అంతకు ముందు బంజరుగా మిగిలినవన్నీ కోలనీయినాయి. పెరిగిన జనాభా కోసం – ప్రైవేటు స్కూళ్లు, అస్పత్రులూ, మార్కెట్లూ వొచ్చేయి. పట్నం చుట్టూ భూములు... మెల్లమెల్లగా ఇళ్ల ప్లాట్‌లు కాసాగేయి. చాకళ్లూ, మంగళ్లూ... యిల్లిల్లూ తిరగలేని దశకూ, షాపులు పెట్టే స్థాయికీ...కొందరు మారేరు. చిన్న, చిన్న రైతులు పలికిన గిరాకీ ధరలకి పంట భూములమ్మేసి తాపీ పనివాళ్లుగా ఆ భూముల్లో లేచిన భవంతులను కూలికి కట్టేవారు. ఇపుడు పట్నం పాత స్థలాన్నీ, మనుషుల్నీ... పోల్చలేం! కొత్త కొత్త వార్డులొచ్చేయి. కొత్త కొత్త వృత్తులూ, వ్యాపారాలూ వచ్చేయి. అందులోంచి, కొత్త రాజకీయాలొచ్చేయి.

జడ్పీ గ్రూపు, టౌను హాలు గ్రూపూ – బలహీనమయి – కొత్త పొలిటికల్ గ్రూఫ్ మరొకటీ రంగంలోకి వొచ్చింది.

ఇంతలో, కోర్టు తీర్పు జగన్నాథం నాయుడి కొడుకు వైపు వచ్చింది. అనుకున్నట్టుగానే, అప్పు కింద పాల్ఘాట్ గోపీ కొనుక్కున్నాడు నన్ను.

ఈసారి, మళ్లీ నా రూపం మారిపోయింది. మొత్తం స్థలాన్ని, ఎఱ్ఱ కంకర పోసి, రోలర్ దోలించి చదునుజేసాడు. రెండు పెద్ద గేరేజ్‌లు గట్టేడు. మెకానికల్ షెడ్డు వొకటి వెయ్యించాడు. యంత్రాలవీ దించేడు. తన బస్సులికి... యిదే స్టేండ్! దాంతో, వొకటొకటిగా

మిగిలిన బస్సులూ...వచ్చిపోయేవి. నా గుండెల మీద బస్సుల పరుగులు. ఇంజన్ల రణగొణ! బస్టేండ్ నయ్యేను. యంత్రాల రొదలో వ్యధ చెందే నాకు ఒక్కటే ఊరట...– జగన్నాథం నాయుడి కొడుకు....పాల్ఘాట్ గోపీ బస్‌ల్లో కార్మికుడిగా చేరాడు, ఆ బాబుని చూస్తూ... గడుపుకొస్తున్నాను కాలాన్ని.

ఈసారి, మార్పులు – నా యిన్నాళ్ల జీవనంలో యెరగనంత వేగంగా జరిగేయి. మార్పు గ్రహించేలోగానే... అది మరో రూపంలో కన్పించేది.

కొత్త రాజకీయ గ్రూపు వొచ్చిందన్నానా? అది కొత్త చట్టాలు తెచ్చింది. అందులో ఒకటి – ప్రైవేట్ బస్సుల రద్దు. పాల్ఘాట్ గోపీ...బస్సులు ఆగిపోయేయి. షెడ్డులు పడుకున్నాయి. గోపీ దగ్గర పనిజేసిన స్టాఫ్‌లో కొంతమందికి ఆర్టీసీలో నౌకరీలొచ్చాయి. జగన్నాథంనాయుడి కొడుక్కి నౌకరీ రాలేదు.

కొత్త రాజకీయ గ్రూపులో, ధనంజయ చేరిపోయేడు. వాళ్ల మద్దతుతో మున్సిపల్ ఛైర్మన్ అయినాడు. అతడికి కొత్తగా, స్పష్టంగా ఆదాయ మార్గాలు యెన్నో కన్పించసాగేయి. రాజకీయాలూ, వ్యాపారాలూ, సంఘ సేవా కార్యక్రమాలూ, మేళవించి నడిపేడు. పాత ప్రత్యర్థుల అడ్డు తొలగించసాగేడు.

ఈ క్రమంలోనే పాల్ఘాట్ గోపీ హోటల్...మున్సిపల్ రోడ్ మీదికి వొచ్చేసిందని కేసు బెట్టించేడు, హోటల్ ఎలివేషనంతా...కొట్టించేసాడు. పాల్ఘాట్ గోపీ యిక, అప్పటిలా రాజకీయ గ్రూపుల వద్దకు తిరగదల్చలేదు! తన జన్మగడ్డకి వెళ్ళిపోదలచి, హోటలూ, బస్సులూ... వొక్కొక్కటీ రొక్కంలోకి మార్చుకున్నాడు. నన్ను మాత్రం...రొక్కం కింద మార్చలేకపోయేడు.

ధనంజయ...నా మీద దృష్టి వేసాడు. బిల్లంశెట్టి షావుకార్ని వెదికి, పట్టుకున్నాడు. షావుకారి...అప్పటికి...పూర్తిగా దివాలా అయిపోయేడు. భార్య...బంధువు వెంట వెళిపోయిందట. ధనంజయ ఆశ చూపించేడు. హైకోర్టుకి తీసుకెళ్ళాడు. కావలసిన పెట్టుబడి పెట్టసాగేడు. బిల్లంశెట్టి షావుకారికి పోయేదేమీ లేదు గనక... ధనం చెప్పినట్లు చేసాడు.

అయితే, యీలోగా...నా ఒడిలో...యెక్కడ్నించో వచ్చిన పింగాణి పాత్రలు అమ్మే ముఠావారు... డేరా దించేరు. మరికొన్నాళ్లకి...పాల్ఘాట్ గోపీ బస్సు వర్కర్లు కొందరు.... పాకలు వేసి, కాపురాలు పెట్టారు. జగన్నాథంనాయుడి కొడుకుగూడా.... వొచ్చిచేరాడు. నాకు యెన్నడు కలుగని ఆనందం కలిగింది. ఇల్లులేని, మరి కొంతమంది పేదలు... చేరారు! పిల్లా, పాపల్తో... కళకళలాడసాగేను నేను.

ధనంజయ – జనం మీదికి బిల్లంశెట్టి షావుకార్ని పంపేవాడు. జగన్నాథం నాయుడి కొడుకు –

"...యే స్థలం? యే హక్కు? చొక్కావారితోట, గోడామైంది. గొడాం...బంకు

కాబోయి, బస్టేండైంది. బస్టేండ్...లేబరోళ్ల బంగళా అయ్యింది. ఇంక నీకూ, నాకూ హక్కెక్కడిదయ్యా... వెళ్లు...” అని, తేల్చి చెప్పాడు.

ధనంజయ వొచ్చి హెచ్చరిస్తే...జగన్నాథం నాయుడి కొడుకు –

“...అసలు ముసలం నువ్వన్నమాట! నీకు యెక్కడలేని జాగాలూ చాల్లేదా? లేబర్ స్థలమూ కావాలా? ఇక్కడ వొక్క పిట్టమనిషి గూడా... యీ స్థలాన్ని వొదల్డు. నువ్వేం జేస్తావో... చేస్కో...” అని జవాబిచ్చేడు.

శభాషో...అన్నాను. అప్పటికి నాలుగేళ్లుగా వుంటున్నారు గదా... అందరూ... జగన్నాధంనాయుడి కొడుకు మాటనే ఖాయపర్చేరు. ధనంజయ హైకోర్టు స్టే వస్తే, పోలీసుల్తో కాగల కార్యం నెరవేర్చుకోవచ్చని ఆ క్షణాన వెనక్కి తగ్గేడు.

కోర్టు యింకా ‘స్టే’ తేల్చలేదు. ఈలోగా జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో...ధనంజయ ఓడిపోయేడు. పాత గ్రూపు గెలిచింది. ధనం...అధికారంలో వున్నన్నాళ్ళూ... వాళ్లను వేధించేడు. అధికారం పోయేక, గజగజలాడిపోయేడు. నెమ్మదిగా పాత రాజకీయ గ్రూపుతో మంతనాలు ఆరంభించేడు. మనమంతా ఒక కుటుంబం. ఈ క్రొత్త గ్రూపువాళ్లు... ద్రోహులు అంటూ ప్లేటు ఫిరాయించేడు.

ఈలోగా హైకోర్టు బిల్లంశెట్టి షావుకారికి...స్టే యిచ్చింది. ఆ వార్తను... ప్రముఖంగా పత్రికల్లో వచ్చేట్లు... స్థానిక విలేకర్లను పట్టుకున్నాడు ధనంజయ! నన్ను ఆక్రమించుకోటానికి, యిలా వొక్కో పథకమూ రచిస్తున్నాడని... గ్రహించలేక పోయేరు... నా ఒడిలోని జనాలు.

పట్నంలో అప్పటికే, హైటెక్ వైద్యం, విద్య, వ్యాపారం వచ్చేసింది. చిన్న చిన్న బడ్డీలు... తొలగిపోయి కాంప్లెక్సులయ్యేయి. చిన్న చిన్న ట్యూషన్ సెంటర్లు... రెసిడెన్షియల్ కాలేజీలయ్యేయి. చిన్న చిన్న కన్సల్టేషన్ క్లినిక్‌లు... నర్సింగ్ హోం భవంతులయ్యేయి. వాటికి తగ్గ హైటెక్... కమర్షియల్ ఎస్టేట్ కోసం, ధనంజయ నన్ను ఆక్రమించదలచేడు.

‘స్టే’ వచ్చిన మూడోరోజు, షావుకారి హత్య, పత్రికల్లో వార్త, నిందితుల కోసం లేబర్ కోలనీలో పోలీసులు గాలింపు...!

పోలీస్ వేనులు, ఇనప బూట్లు, లాఠీలూ... యెంత క్రూరంగా వుంటాయో... అప్పుడు చూసేను.

కొంతమందిని పట్టుకుపోయేరు. ఆడవాళ్లని రోడ్లమీదకు నెట్టేసేరు. ఇళ్లను ధ్వంసం చేసేరు. జగన్నాథం నాయుడు కొడుకు దొరకలేదు. హమ్మయ్య... ‘కొడుకా...రాక్షసుల కంట బడకు...” అని కోరుకున్నాను.

పోలీస్ కేసులోంచి ధనంజయ తప్పించుతానంటే, వొక్కొక్కరూ నన్ను విడిచి వెళిపోయేరు. కదలకుండా వుండిపోయిన పింగాణీపాత్రల ముఠా మీదికి, ధనం, గుండాల్ని తోలేడు. ఇప్పుడు... నేను...ధనం ఆధీనంలోకి వొచ్చేసేను.

"ధనం కమర్షియల్ ఎస్టేట్స్" యెత్తైన బోర్డు నా మొహాన దిగ్గొట్టించేడు. నా లోలోపలికి దవ్వి, యినుప బీములు దించి... నా మీద... అయిదంతస్థుల భవంతి లేపాడు. మూడేళ్లపాటు...నా అంగుళం అంగుళం వాడి కన్స్ట్రక్షన్ వర్కుకి నలిగిపోయింది. నా మీద...మోయలేనంత...భవంతి లేచింది. భారంగా, తల దించుకున్నాను.

ఇంతలో, ఉత్తరం వేపు స్థలం... కబురు బంపింది – జగన్నాథం నాయుడి కొడుకుని చంపేసారట.....

ఆ కబురు నా గుండెల్ని పొడిచింది. ఆ దుర్మార్గులు యెవరో తెలిసీ, ఇంకా యీ పాపాన్ని మోయటం... నా వల్ల కాలేదు. ఇన్నాళ్ల సహనాన్నీ దులిపేసి; ఒక్కసారి ఒళ్లు విదిలించి... కంపించేను...!

అంతే! అంతస్థుల భవంతి కూలిపోయింది.

అదిగో... అక్కడి ఆదిత్య క్షేత్రం సాక్షిగా చెప్తున్నాను... శిథిలాల్లోంచే... మళ్లీ యేదైనా కొత్తగా మొలకెత్తేది!★

*ఆదివారం ఆంధ్రజ్యోతి 23 ఫిబ్రవరి, 1997*